క్లుప్తంగా

వినాయకుడి లడ్డూ రూ.51 వేలు



వేలం పాటలో లడ్డును ఊరేగింపుగా తీసుకెళ్తున్న సునీల్‌రెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి రెడ్డి బజార్‌లో స్థానిక భక్తులు ఏర్పాటు చేసిన వినాయకుడు వద్ద లడ్డూను సునీల్ కుమార్‌రెడ్డి రూ.31,500 వేలం పాటలో పాడుకున్నాడు. వినాయకుడు నిమజ్జనం సందర్భంగా ఆదివారం వినాయకుడు వద్ద గత 5 రోజులుగా పూజలు అందుకున్న లడ్డుకు నిర్వహించిన వేలంలో సునీల్ కుమార్‌రెడ్డి లడ్డును దక్కించుకున్నారు. లడ్డును తన కుటుంబ సభ్యులుతో కలిసి ఊరేగింపుగా ఇంటికి తీసుకువెళ్లాడు.

గాంధీనగర్‌లో రూ.51 వేలు పలికిన వినాయకుడి లడ్డు

చీమకుర్తి: చీమకుర్తి గాంధీనగర్ 2వ లైన్‌లోని వినాయకుడి వద్ద పూజలు అందుకున్న లడ్డును సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సూది వెంకట్రావు, ఆయన కుమారుడు సాయి పవన్ రూ.51,116కు దక్కించుకున్నారు. ఆదివారం వినాయకుడి నిమజ్జనం సందర్భంగా వినాయకుడి లడ్డుకు నిర్వహించిన వేలం పాటలో వారు పోటాపోటీగా సాగిన లడ్డును వేలంలో దక్కించుకొని ఊరేగింపుగా తీసుకెళ్లారు.



వేలం పాటలో లడ్డును పాడుకున్న సూది వెంకట్రావు

లేఅవుట్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకారెడ్డి

చీమకుర్తి: ప్రభుత్వంచే చీమకుర్తిలో డీటీసీపీ అనుమతులు పొందిన మొట్టమొదటి లేఅవుట్ ఎంఎస్ఆర్ నగర్ వెంచర్ అని ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి తెలిపారు. ఆదివారం చీమకుర్తి శివారులో రామచంద్ర మిషన్ పక్కన ఏర్పాటు చేసిన ఎంఎస్ఆర్ వెంచర్‌లో నిబంధనల ప్రకారం 40 అడుగుల వెడల్పు తారురోడ్డు, సైడు కాలువలుతో పాటు ఇతర సదుపాయాలను ఏర్పాటు చేసిన వెంచర్‌ను చీమకుర్తి వాసులకు తక్కువ ధరలకే అందిస్తున్నట్లు మారం వెంకారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బ్రోచర్‌లను ఆవిష్కరించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గోపిరెడ్డి సుధీర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పోకూరి రామకృష్ణారెడ్డి, పేరం శ్రీనివాసరావు, అవిశనేని వెంగన్న స్థానికులు పాల్గొన్నారు.



ఒంగోలులోని శ్రీనగర్ 4వ లైన్‌లో కొలువైఉన్న గణనాథుడు



గణపతి బప్పా మోరియా.. వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న యువత



వినాయకా సెలవికా.. నిమజ్జనం కోసం వినాయకుడిని తీసుకెళ్తున్న భక్తులు

గంగ ఒడిని చేరిన గణనాథుడు

- కోలాహలంగా వినాయక నిమజ్జనాలు
- జనసంద్రంగా మారిన కొత్తపట్నం బీచ్
- 498 విగ్రహాల నిమజ్జనం
- 126 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన చర్యలు
- సుమారు 30 వేల మందికిపైనే పాల్గొన్న భక్తులు



జనసంద్రంతో నిండిన కొత్తపట్నం సముద్రతీరం



గణేశా.. వెళ్లిరావయ్యా అంటున్న చిన్నారులు

కొత్తపట్నం: పార్వతీ తనయుడు.. విఘ్నాలను తొలగించే వాడు, తొలి పూజలందుకునే ఆదిదేవుడు వినాయకుడు గంగ ఒడిని చేరాడు. ఐదు రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న గణనాథుడిని మేళ తాళాల మధ్య నిమజ్జనం చేశారు. రంగులు చల్లుకుంటూ డీజే పాటల హోరుతో యువత, చిన్నారులు సందడి చేశారు. ఒంగోలు నగరమంతా జైజై వినాయకా.. బైబై వినాయక.. జైబోలో గణేశ్ మహారాజ్‌కి జై అంటూ హోరెత్తించారు. నగరమే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా తమ వినాయకులను కొత్తపట్నం సముద్ర తీరానికి తరలించారు. ఆయా మండపాల వద్ద అన్నసంతర్పణలు చేశారు.

జనసంద్రంతో నిండిన కొత్తపట్నం బీచ్..

కొత్తపట్నం బీచ్‌లో వినాయక నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. బీచ్ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడం, పైపెచ్చు ఐదో రోజు అవడంతో బీచ్ ప్రాంతం, మెయిన్ బజార్లు భక్తులతో కిటకిటలాడింది. అదేవిధంగా ఈతముక్కల, మడనూరు బీచ్ ప్రాంతంలో సూరారెడ్డిపాలెం నుంచి వచ్చి వినాయక నిమజ్జనాలు నిర్వహించారు. కొత్తపట్నం బీచ్‌లో వినాయక విగ్రహాలు 342, ఈతముక్కల బీచ్‌లో 48, మడనూరు బీచ్‌లో 108 విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఒంగోలు నుంచి కొత్తపట్నం వరకు వినాయక విగ్రహాలు బారులు తీరాయి. అటువైపు సూరారెడ్డి పాలెం నుంచి ఈతముక్కల, మడనూరు బీచ్ వరకు వినాయక విగ్రహాలు బారులు తీరాయి. మధ్యాహ్నం 3 గంటలకు మూడు బీచ్‌లలో 127 విగ్రహాలు విగ్రహాలు నిమజ్జనం చేయగా, 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు వినాయక విగ్రహాలు భారీగా వచ్చాయి. 4 గంటల సమయానికి ఒక్కసారిగా విగ్రహాలు ఎక్కువగా రావడంతో తీరం కిలో మీటరు దూరం వరకు కిటకిటలాడింది. దీంతో పోలీసులు వారిని అదుపు చేయడానికి కొంత ఇబ్బంది పడ్డారు. 126 మంది పోలీసు సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అలలు ఉధృతంగా ఉండంతో పోలీసులు ఎప్పటికప్పుడు మైక్ ద్వారా భక్తులను అదుపు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్సై సుధాకర్ బాబు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఐదుగురు ఎస్సైలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు హోంగార్డులు కలుపుకుని 101, మెరైన్ సిబ్బంది 15, స్పెషల్ పార్టీ 10, ఈతగాళ్లు మత్స్యకారులు 10 మంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులకు వైద్యం అందించారు. ఎంఎల్‌హెచ్‌పీ (సీహెచ్‌వో) యామిని, ఆశావర్కర్లు వైద్య సేవలు అందించారు.

ఆకట్టుకున్న నృత్యాలు..

ఒంగోలు మెట్రో: నగరంలోని రాజాపానగల్ రోడ్డు నాలుగో వీధిలో గణపతి నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఉన్న గణనాథుని చూడడానికి నగర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొంటున్నారు. ప్రతిరోజు నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి చిన్నారులు వేసిన కోలాట నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి.



వినాయకుడికి కుంకుమ పోస్తున్న చిన్నారులు

సాగర్ కాలువల్లో వినాయక నిమజ్జనాలు..

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని పలు గ్రామాల నుంచి ఘనంగా వినాయక స్వామిని నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఆదివారం 5వ రోజు గణనాథులకు నిర్వాహకులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం సంతనూతలపాడు సమీపంలోని చంద్రపాలెం ఎన్ఎస్పీ కాలవలో ఘనంగా నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ముఖ్యంగా సంతనూతలపాడు, బొడ్డువారిపాలెం, మద్దులూరు, ఎనికెపాడు, చంద్రపాలెం, తదితర గ్రామాల్లో నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఒంగోలు రూరల్ సీఐఎస్. శ్రీకాంత్ బాబు పర్యవేక్షణలో, సంతనూతలపాడు ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది స్థానిక సాగర్ కాలువల వద్ద ప్రత్యేక పికెట్ ద్వారా బందోబస్తు పర్యవేక్షించారు.



ఒంగోలులో నిమజ్జనోత్సవంలో డీజేకు స్టెప్పులు వేస్తున్న యువకులు



గణేశా.. జాగ్రత్తగా వెళ్లయ్యా: సముద్రంలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



వినాయక విగ్రహాలతో సందడిగా చిన్నారులు



ఎన్ఎస్పీ కాలువలో వినాయకుని నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు



బోలో గణేశ్ మహారాజ్ కి జై : తలపై ఎత్తుకుని నిమజ్జనం చేస్తున్న మహిళలు



అంకమ్మతల్లి దేవస్థానం వద్ద వినాయక స్వామి గ్రామోత్సవంలో భక్తులు హడావుడి



వినాయకుడిని చేతిలో తీసుకొస్తున్న యువత

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవిబాబు
- వినాయకుడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చుండూరి, నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పిస్తున్న చుండూరి రవిబాబు, నాయకులు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. శనివారం రాత్రి ఎన్ అగ్రహారంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహానికి చుండూరి రవిబాబు పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులందరూ సమన్వయంతో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలులో విఫలమైందన్నారు. అనంతరం పట్టణంలోని 27వ డివిజన్ కేశవస్వామి పేటలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద రవిబాబు ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పవరపు వాసు, కోఆప్షన్ సభ్యులు శ్యాంసాగర్, పల్నాటి రవీంద్రనాథ్ రెడ్డి, పులుసు సురేష్, దేవ, పీటర్, రఫీ, ఆవుల అనీల్, విస్సు, సురేష్, పృథ్వీ, సాయి, తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రవిబాబు

6, 7 తేదీల్లో దళిత సంక్షేమం, చట్టాల అమలుపై సదస్సు

ఒంగోలు వన్‌టౌన్: దళిత సంక్షేమం, చట్టాల అమలుపై విజయవాడలో ఈనెల 6,7 తేదీల్లో సదస్సు నిర్వహిస్తున్నట్లు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా దళిత సంక్షేమం ఎండమావిగానే ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లను పునరుద్ధరించి సబ్సిడీ రుణాలను విడుదల చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు మంజూరు చేసిన్నట్లు ప్రచారం చేసుకున్న ప్రభుత్వం ఒక్క రూపాయ నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. అదే విధంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో కూడా రూ.341 కోట్లు సబ్సిడీగా నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించి ఒక్క రూపాయి కుడా విడుదల చేయలేదన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఈడబ్ల్యూఎస్ అగ్రకులాల వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తూ అర్హతగా వయస్సును 60 సంవత్సరాలుగా నిర్ధారించారన్నారు. అదే ఎస్సీ, ఎస్టీలకు రుణాలు మంజూరుకు 50 సంవత్సరాల అర్హతను నిర్ణయించి అణిచివేయాలని చూస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు.

ఘనంగా రాధాష్టమి వేడుకలు

ఒంగోలు మెట్రో: నగనరంలో రాధాదేవి అమ్మవారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగమూరురోడ్డు వేద పాఠశాల వద్ద గల శ్రీరాధాగోవింద ఆశ్రమంలో రాధాదేవి అమ్మవారి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాధాష్టమి పర్వదిన వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్నిధిలో గల రాధాకృష్ణుల మందిరాన్ని పుష్ప తోరణాలతో నేత్రపర్వంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు ముందుగా సన్నిధిలో వేంచేసియున్న రాధాకృష్ణులకు గులాబీలు పలు రకాల పుష్పాలతో పుష్పాభిషేకాన్ని నేత్రోత్సవంగా జరిపించారు. రాధాకృష్ణులకు 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. స్థానిక భక్తులు రాధాకృష్ణుల మందిరంలో సామూహిక భగవద్గీత పారాయణం, హరినామ సంకీర్తన భజన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిర నిర్వాహకులు అళమరి కృష్ణమోహనాచార్యులు, అళమరి శ్రీనివాసాచార్యులు, స్వామి అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమాలలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ట్రంకు రోడ్డు మస్తాన్ దర్గా వద్ద గోకుల గోపాలకృష్ణ దేవస్థానంలో చిన్నికృష్ణుడికి అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థాన నిర్వాహకులు నిమ్మకాయల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.



ప్రత్యేక పుష్పాలంకరణలో రాధాకృష్ణులు



రామచంద్ర మిషన్ వద్ద 108 రకాల నైవేద్యాలతో భక్తులు